
᠎


ఆఫీస్‌నించి రాగానే - అంటే ఆరు గంటలకు - భోజనం చేయటం అలవాటయి పోయింది. కారు డ్రైవ్‌వేలో ఆపుతుండగానే, ప్రసూన డైనింగ్ టేబుల్ మీద అన్నీ సిద్ధం చేస్తుంది.

బట్టలు కూడా మార్చుకోకుండా, ఆవురావురు మంటూ ఆత్మారాముడిని శాంతపరుస్తున్నాను.

గబగబా తింటుంటే, ప్రసూన ఎదురుగా కూర్చుని, నెమ్మదిగా తింటూ - "మధ్యాహ్నం లంచ్ సరిగ్గా తినలేదా?" అని అడిగింది.

"తిన్నాను. కానీ చాల్లేదు!" అన్నాను, తినటం మాత్రం ఆపకుండా.

"రేపటినించీ ఏదన్నా స్నాక్ కూడా పాక్‌చేసి ఇస్తాలే.... ఏ మూడింటికో తిందువుగాని..." అన్నది ప్రసూన చిన్నగా నవ్వుతూ.

"అలాగే" అన్నాను తినటం కొనసాగిస్తూ.

హఠాత్తుగా గుర్తొచ్చి అడిగాను.

"సరస్వతి ఏదీ?" అని.

"ఎవరో ఫ్రెండ్‌తో బయటకు వెళ్లాలిట. అక్కడే భోజనం చేస్తుందిట" అన్నది ప్రసూన.

తల పై కెత్తి. అనుమానంగా అడిగాను - "ఫ్రెండా.... డేటా..." అని.

"ఫ్రెండే... అనుకుంటాను. దాన్నే అడగరాదూ.... మేడ మీద వుంది" అంది ప్రసూన.

తినటం పూర్తిచేసి, చేయి కడుక్కుంటుంటే, అప్పుడే ఫోన్ మోగింది.

ఫీనిక్స్‌నించి సుబ్బారావు.

"ఏం బాబూ! ఏం చేస్తున్నావ్? డిన్నర్, గిన్నర్ అయిపోయాయా?" అన్నాడు.

"గిన్నర్ ఇంకా అవలేదు. కానీ, డిన్నర్ మాత్రం ఇప్పుడే అయిపోయింది. అది సరే గానీ ఏమిటి ఇప్పుడు పిలిచావ్" అడిగాను.

"ఇంకా మాలతి ఇంటికి రాలేదు. ఇవాళ ఆఫీసులో కొంచెం ఆలస్యమవుతుందిట. నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి" అన్నాడు.

"చెప్పు!" అన్నాను. కార్డ్‌లెస్ ఫోన్ తీసుకుని, లేజీబాయ్ రిక్లైనర్ ఛైర్లో నడుం వాలుస్తూ. సుబ్బారావు ఏదో పెద్ద కథే చెప్పబోతున్నాడని తెలుస్తూనే వుంది.

"మా ఊళ్లో బాలు అనబడే బాలసుబ్రమణ్యం గారొకాయన ఉన్నాడు. ఆయనకు ఒక్కగానొక్క కూతురు. ఇరవై ఆరేళ్ళ క్రితం అమెరికాలోనే పుట్టింది. ఆ అమ్మాయి పేరు వసు. పోయిన సంవత్సరం ఇండియాకి వెళ్లినప్పుడు హైదరాబాద్‌లో కుమార్ అనబడే అబ్బాయిని ఒక పెళ్లిలో చూసింది. ఆ అమ్మాయికీ, ఆ అమ్మాయి తల్లిదండ్రులకీ, ఆ అబ్బాయి నచ్చాడు. కుమార్ కూడా వసు అంటే ఇష్టపడ్డాడు. పది రోజుల్లో పెళ్లి కూడా అయిపోయింది" - ఆగాడు సుబ్బారావు.

"అతను ఈ దేశానికి రావటానికి, వీసా ఇబ్బందులు కూడా ఏమీ వచ్చివుండవు... ఆ అమ్మాయి ఇక్కడే పుట్టింది కనుక" అన్నాను.

"అవును. ఆ అమ్మాయి అమెరికన్ సిటిజన్ కాబట్టి, అతను ఐదు నెలల్లోనే ఇక్కడికి రాగలిగాడు".

"తరువాత కథ ఫీనిక్స్‌కీ, మనం ఇంటికీ..." అన్నాను చిన్నగా నవ్వుతూ.

"కాదు... కాదు. కథ ఇక్కడే మొదలయింది. వసు టెలివిజన్ బ్రాడ్‌కాస్టింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఫీనిక్స్‌లోనే ఎన్.బి.సి.ఎఫిలియేట్ టీవీ స్టేషన్‌లో పనిచేస్తున్నది. కుమార్ ఇండియాలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివి, అక్కడ ఒక కంపెనీలో ఆరేళ్లు ఉద్యోగం కూడా చేశాడు. వసు సలహా మీద కుమార్ యూనివర్సిటీ ఆఫ్ ఆరిజోనాలో, మాస్టర్స్ ప్రోగ్రాంలో చేరాడు. రేండేళ్లు చదివి, ఎం.ఎస్.డిగ్రీ తీసుకుంటే మంచి ఆఫర్‌లు వస్తాయని" అన్నాడు.

"అవును. దట్ హెల్ప్స్" అన్నాను.

"వాళ్లిద్దరూ సుఖంగా ఒక నెల రోజులు ఉన్నారేమో. ఇద్దరికీ ఏ విషయంలోనూ పడలేదు. ఆ అమ్మాయి పద్ధతి ఆ అబ్బాయికీ, ఆ అబ్బాయి పద్ధతి ఆ అమ్మాయికీ ఏమీ నచ్చలేదు. వసుకి తెలుగు అర్థమవుతుంది. కానీ, మాట్లాడటం రాదు.

"ఆ అమ్మాయి ఇంగ్లీష్ ఉచ్చారణ కూడా, కుమార్‌కి పూర్తిగా అర్థమయేదికాదు. వసు మంగళసూత్రం తీసేసి డ్రెస్సర్‌లో పడేస్తే, నిర్ఘాంతపోయాడు కుమార్. చీర కట్టుకోని, కట్టుకోవటం చేతకాని వసుని వింతగా చూశాడు. తన నిర్దుష్టమైన అభిప్రాయాలను సూటిగా చెప్పే వసుని, అహంకారంతో అలా మాట్లాడుతున్నదని అపార్థం చేసుకున్నాడు.

"మగవాళ్లతో అరమరికలు లేకుండా మాట్లాడుతున్న వసులో తను అనుకున్న భార్యను చూడలేక పోయాడు. భార్య ఉద్యోగం చేస్తుంటే తను కాలేజీకి వెళ్లటం చిన్నతనంగా భావించాడు.

"ఉద్యోగం పురుష లక్షణం అనుకునే అతన్ని, అతని భార్యే భరిస్తుంటే ఆర్థిక స్వాతంత్ర్యంలేక, ప్రతిక్షణం అతనికి నరకంలా అనిపించింది. అలాగే అతని పద్ధతి కూడా వసుకి నచ్చలేదు. కుమార్ కాఫీ తాగిన గ్లాసు అక్కడే వదిలివేయటం, అన్నం తిన్న ప్లేటు బల్ల మీద వదిలివేయటం, ఇంటి పనిలో ఏమీ సహాయం చేయకుండా, టీవీకే అంకితమయిపోవటం, అమెరికాలో పెరిగిన వసుకి నచ్చలేదు".

"అవును మరి. ఇక్కడకు వచ్చాక, ఇంటిపనులు ఇద్దరం సమానంగా చేస్తాంకదా" నెమ్మదిగా అన్నాను. ప్రసన్న ఒక్కత్తే అన్ని పనులు చేస్తుంటే, నవ్వుతూ ఆమెని చూస్తూ.

"చిన్నప్పటినుంచీ, తన తండ్రి, అన్న ఇంట్లో, అన్ని పనులు చేయటం చూసిన వసుకి, కుమార్ ఒక బద్ధకస్తుడిలా కనిపించాడు. కాలేజీలేని రోజున మధ్యాహ్నం నిద్రపోయే కుమార్‌ని చూసి-

"ఎందుకలా జీవితాన్ని వృథా చేసుకుంటావు", అని అడిగేది. ఆ సమయంలో ఏదన్నా పార్ట్‌టైమ్ జాబ్ చేయవచ్చుకదా అనేది. కుమార్‌ని తన స్నేహితులకి పరిచయం చేసినా, అతను వాళ్లతో కలవలేకపోవటం ఆమెని నిరుత్సాహపరిచింది.

"వసూ ఆమె మిత్రులూ మాట్లాడుకునే విషయాలు అమెరికన్ జీవితానికి సంబంధించి వుండటం వల్ల, కుమార్‌కి ఉత్సాహంగా ఉండేవి కావు. అలాగే కుమార్‌కి ఇష్టమైన ఇండియన్ రాజకీయాలూ, తెలుగు సినిమాలు, పాటలు, సాహిత్యం వసుకి అర్థమయేవి కావు. అలా వాళ్లిద్దరి మధ్యా దూరం పెరిగింది".

"మరి వాళ్లిద్దరూ కావాలని పెళ్లి చేసుకున్నారు కదా! ఆ సంగతి ముందే వాళ్లు ఎందుకు

ఆలోచించలేదు. చదువూ సంస్కారం వున్న వాళ్లేకనుక, ఇద్దరూ చెరో రెండు మెట్లూ దిగి సర్దుకుపోతే, వాళ్ల జీవితం సుఖంగా వుండేదికాదూ!" అన్నాను రిక్లైనర్ ఛైర్‌లో పడుకుని సుఖంగా ఊగుతూ.

"ఆ ప్రయత్నాలన్నీ చేశారు కానీ, అవేమీ పనిచేయలేదు. ఒకరి మీద ఒకరికి ప్రేమ బదులు ద్వేషం మొదలయింది. బాగా మనస్పర్థలు వచ్చాయి".

"మరి మీ బాలుగారూ, ఆయన పూబంతీ ఏమీ చేయలేకపోయారా?" అడిగాను.

"చెప్పి చూశారు కానీ.... వాళ్లు మాత్రం ఏం చేస్తారు... సర్దుకుపోవలసిన వాళ్లు ఎడముఖం పెడముఖం అయిపోయినప్పుడు..... వసు అతనికి రెండు నెలల క్రితమే విడాకులు ఇచ్చింది" ఆగాడు సుబ్బారావు.

"అంటే పెళ్లైన పది నెలలకే విడిపోయారన్న మాట. నన్ను సలహా అడిగితే, అసలు వాళ్లు పెళ్లి చేసుకోకుండా ఉండాల్సిందనిపిస్తోంది" అన్నాను. అడక్కుండా ఉచిత సలహాలెప్పుడూ ఇవ్వకు అని ప్రసూన రోజుకి రెండుసార్లు నాకు ఇచ్చే సలహాని మరిచి పోయానప్పుడు.

"ఎందుకని?" అడిగాడు సుబ్బారావు.

"ఎందుకనా?...... అమెరికాకీ, ఇండియాకీ సాంస్కృతికంగా ఎంత తేడా వుందో, వసుకీ కుమార్‌కీ అంత తేడా వుంది. వసు ఈజ్ మేడ్ ఇన్ అమెరికా. కుమార్ ఈజ్ మేడ్ ఇన్ ఇండియా. అందుకని!"

"మరి మనలాంటి భారతీయులం, ఇక్కడ అమెరికన్ సంస్కృతిలో భాగం అయిపోయి, పౌరసత్వం తీసుకుని, అమెరికన్స్‌తో కలిసిపోయినప్పుడు.... మరి వీళ్లిద్దరూ ఎందుకు కలవలేకపోతున్నారు?" అడిగాడు సుబ్బారావు.

అప్పుడే గుర్తుకొచ్చింది-

ఈ సుబ్బారావు అనబడే వీడు, అక్కడ ఆంధ్రా యూనివర్సిటీనించి, ఇక్కడ ఆరిజోనా యూనివర్సిటీ దాకా, డిబేట్లల్లో ఎప్పుడూ మొదటి బహుమానాలే గెలుచుకునేవాడని.

ఒక్క క్షణం ఆలోచించి అన్నాను - "ఇండియా నించి వచ్చే మనకే కాదు, ఏ దేశం నించయినా సరే అమెరికాకు వచ్చే ఇమ్మిగ్రెంట్స్‌కి ఒకటే ముఖ్యోద్దేశ్యం. ఇక్కడ సెటిలయి, సాంకేతిక పరంగా కానీ, వ్యాపార పరంగా కానీ, ఆర్థిక పరంగా కానీ, వాళ్ల కలలని నిజం చేసుకోవటం. అందుకని జీవితంలో ఎడ్జస్ట్‌మెంట్లను చేసుకోవలసి వస్తుంది చేసుకుంటాం.

"కానీ ఇక్కడే పుట్టి పెరిగిన పిల్లల ఆలోచన అలా కాదు. ఇంట్లో వాళ్లు గోంగూర పచ్చడి తిన్నా - బయట, వాళ్ల ప్రపంచం వేరు. చాలావరకూ అమెరికనైజ్ అయిపోతారు. ఆ ఆలోచనల

తీరు, భావాలు, ప్రవర్తనలలో ఆ తేడా కనిపిస్తుంది. ముఖ్యంగా వాళ్లకి 'నా' అనే నిర్దుష్టమైన వ్యక్తిత్వం వస్తుంది.

"చాలామంది స్వతంత్రంగా బతకటానికి ఇష్టపడతారు. భార్యాభర్తలలో తక్కువ ఎక్కువలు ఉండటం వాళ్లు సహించలేరు. కట్నాలు తీసుకునే మగవారికి విలువుండదు. ఇంట్లో పనిచేయని మగవారిని సమర్థించలేరు. ఇద్దరూ కలిసి ఇంటా బయటా జీవితాన్ని సమానంగా పంచుకోవాలి అనే అభిప్రాయం వారి నరనరాల్లోనూ ఉంటుంది. ఇద్దరికీ ఆర్థిక స్వాతంత్రం కావాలి. ఇండియా నించి వచ్చిన చాలమంది మొదటి తరం మగవాళ్లల్లో ఆ భావన వుండటం కష్టం. కొంతమందిలో ఆ భావన వున్నా, అది భావపరంగానే వుంటుందికానీ, చేతల్లో కనపడటం మాత్రం తక్కువ" ఆగాను.

"మరికొన్ని సందర్భాల్లో, ఇలాంటి వివాహాలు ఏ గొడవా లేకుండా సుఖవంతంగా ఉంటున్నాయి కదా" అన్నాడు సుబ్బారావు.

"ఉండవని ఎవరన్నారు? అది ఆ ఇద్దరు వ్యక్తుల వ్యక్తిత్వాన్ని బట్టి ఉంటుంది. ఇద్దరూ ఇక్కడే పుట్టి, పెరిగి, పెళ్లి చేసుకుని సుఖంగా ఉన్నవాళ్లూ ఉన్నారు. విడిపోయిన వాళ్లూ వున్నారు. ఇటువంటి విషయాల్లో స్టాటిస్టిక్స్ కన్నా, ఆ వ్యక్తుల నైజాన్ని బట్టి, ఆ నిర్ణయాలు జరిగితే బాగుంటుందేమో!" అన్నాను. నాకు ముప్పై ఏళ్ల నుంచీ, తిండీ, గూడూ, బట్టా, కారూ సంపాదించిపెడుతున్న, స్టాటిస్టిక్స్‌ని కొంచెం దూరం చేస్తూ.

"అంతేనంటావా?" సాలోచనగా అన్నాడు సుబ్బారావు.

అతను అలా అంటుంటే, ఏదో అనుమానం వచ్చింది నాకు. మనసులో పెట్టుకోవటం ఎందుకని, వెంటనే అడిగేశాను.

"ఏమిటి సుబ్బారావ్.... అన్నీ తరిచి తరిచి అడుగుతున్నావ్.... విశేషమేమీ లేదు కదా?"

సుబ్బారావు ఒక్క క్షణం ఆగి అన్నాడు-

"ఉందనుకుంటే వుంది..... లేదనుకుంటే లేదు.... కృష్ణ.... అదే మా అబ్బాయి కృష్ణ... ఫిలడెల్ఫియా నించి పిలిచాడు నిన్న....."

"ఏమంటాడు..." ఏదో అనుమానం తొలిచి వేస్తుంటే అడిగాను.

"ఫోన్‌చేసి - నాన్నా నేను, ఇండియాలో పుట్టి పెరిగిన అమ్మాయినే పెళ్లి చేసుకుంటాను - అని గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చాడు".

పెద్దగా నవ్వి అన్నాను - "మరింకేమయ్యా..... సంతోషించాల్సిందిపోయి.... దిగులుగా మాట్లాడతావేం?"

"ముందు...... నేనూ, మాలతీ నువ్వన్నట్టుగానే సంతోషించాం. కానీ బాలుగారి అమ్మాయి కథ విన్న తర్వాత, నాలో ఆలోచన ప్రారంభం అయింది. అందుకే నీ సలహా అడుగుదామని.... ఫోన్ చేసాను. ఇక్కడే పుట్టి పెరిగిన వీడికీ, అక్కడ నించీ వచ్చే ఆ అమ్మాయికీ కంపాటిబిలిటి వుంటుందా అని, సుఖంగా ఉండగలుగుతారా అని".

ప్రసూన వచ్చి సోఫాలో కూర్చున్నది. ఆమె ముఖం చూస్తే, అసలు కథ అర్థమయినట్టు కనిపించటం లేదు. పగలల్లా ఉద్యోగం చేసొచ్చి, ఇంట్లో వంట, మిగతా పనులూ చేయటం వల్ల అలసటగా వున్నట్టుంది.

నా సలహా అడిగాడుకనుక. అది ఉచితమే అయినా ఉచిత సలహా అవదు కనుక, గొంతు పెంచి అన్నాను - "ఇందాక చెప్పాను కదా... అది వాళ్ల వ్యక్తిత్వాలను బట్టి వుంటుంది అని. ఆ కంపాటిబిలిటీ వున్న పిల్లనే ఇచ్చి పెళ్లి చేస్తేసరి" అన్నానేకానీ, కొన్ని వేల మైళ్ల దూరంలో వున్న ఈ కుర్రాడికి, అక్కడికి వెళ్లి, అలాటి పిల్లను చూసి పెళ్లి చేసుకోవటానికి తగిన సమయం కానీ, అవకాశం కానీ వుంటుందా?

"అదే మాలతి కూడా అంటున్నది. వీలు చూసుకుని ఇండియా వెళ్లి, మనవాళ్లకు బాగా తెలిసిన సంబంధం చూసి, వీళ్లిద్దరికీ పరిచయం చేస్తే సరిపోతుంది. పెళ్లి మాత్రం ఇప్పుడు వద్దు అంటుంది మా ఆవిడ. వాళ్లిద్దరూ ఫోన్ ద్వారానూ, ఈమైల్ ద్వారానూ, ఉత్తరాల ద్వారానూ ఒకళ్లనొకళ్లను అర్థంచేసుకుని, పెళ్లి చేసుకుంటే బాగుంటుంది అంటుంది మాలతి. అదే నాకూ సబబనిపిస్తున్నది. ఏమంటావ్?"

"శుభం.... మంచి సలహా. అలాగే కానివ్వు అంటాను" అన్నాను మనస్ఫూర్తిగా.

మరి కాసేపు మాట్లాడి ఫోన్ పెట్టేసి, ప్రసూనకి ఆ కథ చెప్పబోతుంటే, డోర్‌బెల్ మోగింది. ప్రసూన లేచి వెళ్లి తలుపు తీసింది.

ఒక తెల్లటి అమెరికన్ కుర్రాడు నిలబడివున్నాడు. సన్నగా, పొడుగ్గా వున్నాడు. నేను భయపడిందేదో జరగబోతున్నట్టుంది.

"ఐ యామ్ స్కాట్, ఐ కేమ్ టు పికప్ శారా" అని అన్నాడు కుర్రాడు.

ఈ లోగా మా అమ్మాయి సరస్వతి గబగబా మేడ మీద నించి వచ్చి "హాయ్ స్కాట్.... లెటజ్‌గో..." అని మా ఇద్దరికేసి చూసి, "బాయ్...." అంటూ చేయి వూపి, అతనితో బయటకు వెళ్లిపోయింది. ●

*(స్వాతి సపరివార పత్రిక : మే 28, 1999)*